క్లుప్తంగా

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సచివాలయంలో గురువారం పెద్దలకు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మద్యం, పొగాకు ఉత్పత్తులు వాడేవారు తప్పనిసరిగా ఈ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. తాడేపల్లి ప్రాథమిక కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ శాంతకుమారి మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ గురుకుమార్, సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా విద్య హోమం



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డి నగర్‌లోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో గురువారం మహా విద్య హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ హోమ శాలలో గుండాన్ని సుందరంగా అలకరించి, గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగార్జునశ ర్మ హోమాలు చేశారు. మహా విద్య మూల మంత్రాలతో హోమం శాస్త్రోక్తంగా చేపట్టగా, కనుల పండువగా పూర్ణాహుతి చేశారు. ఆలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి పర్యవేక్షణలో మహా విద్య హోమం జరగ్గా, దాసరి రాము, లీలాకృష్ణ, కృష్ణశ్రీ, భక్తులు పాల్గొన్నారు.

రేపు మధుర గీతాల సినీ సంగీత విభావరి

నగరంపాలెం: భారతీ సాంస్కృతిక సంగీత కళా వేదిక 9వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న 'మధుర గీతాల సినీ సంగీత విభావరి' నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భారతీ కళా వేదిక స్వరాంజలి గాయనీ గాయకులు హాజరై పాత, కొత్త గీతాలతో ప్రేక్షకులను అలరించనున్నారని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుగాలీ కాలనీకి చెందిన జటావత్ మంగ్యా (23) అనే వ్యక్తి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి వివాహమైంది. సంతానం ఉంది. అయితే పూర్తిగా మద్యానికి బానిసైన మంగ్యా అప్పుల పాలవడంతో తల్లిదండ్రుల ఇంటిని అమ్మేసి అప్పులు తీర్చాడు. దీంతో తమ ఇల్లు పోయిందనే మస్తాపానికి గురై ఈ నెల 15న గాంధీ పార్కు సమీపంలో గడ్డి మందు తాగాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా, మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ పార్టీ పేరును ప్రజల్లో తప్పుదోవ పట్టిస్తున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. షేక్ హుస్సేన్ బాషా ఇండియన్ ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షుడిగా చెప్పుకుంటూ రాజకీయంగా అసత్య ప్రచారం చేస్తున్నాడు. ముఖ్యంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీకి అప్రతిష్ట తెస్తున్నాడని ఆ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ షేక్ యూనస్ గురువారం పోలీసులకు పిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న భరత నాట్య ప్రదర్శన

చేబ్రోలు: అన్నమాచార్యుని జయంతి సందర్భంగా మండల కేంద్రమైన చేబ్రోలులో భరత నాట్య ప్రదర్శన, కోలాట ప్రదర్శన, సామూహిక హారతి కార్యక్రమం ఘనంగా జరిగింది. చేబ్రోలులోని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వైశాఖ పౌర్ణమి, బుద్ధ పౌర్ణమి, అన్నమాచార్యుల వారి 616వ జయంతి సందర్భంగా స్థానిక అన్నపూర్ణ సత్రం సమీపంలోని రామ మందిరంలో సామూహిక హారతి జరిగింది. అన్నమాచార్యుల జయంతి సందర్భంగా మంచాల వారి కోలాట భక్త బృందం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన జరిగింది. చిన్నారులు పోలం రేణ్యశ్రీ,, రుషికల భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఉదయగిరి శ్రీను ఆధ్వర్యంలో అన్నమాచార్యుని కీర్తనలు, పౌరాణిక పద్యాలు ప్రదర్శించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ పోలం ప్రసాదరెడ్డి, మండల కన్వీనర్ చదలవాడ హేమలత, ధార్మిక సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు అండగా పెద్దాసుపత్రి



ఈ ఫొటోలో కనిపిస్తున్న యువకుడి పేరు చిత్తజల్లు సందీప్. మచిలీపట్నంకు చెందిన అతను కిడ్నీ జబ్బుతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేసినా వ్యాధి తగ్గకపోవడంతో వైద్యులు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. యువకుడు రోజువారి కూలి కావడంతో పెద్ద మొత్తంలో ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు భరించలేక గుంటూరు జీజీహెచ్ వైద్యులను సంప్రదించాడు. యువకుడి తల్లి పద్మావతి కిడ్నీ దానం చేయడంతో గతేడాది డిసెంబరులో గుంటూరు జీజీహెచ్‌లో సుమారు రూ.10 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తి ఉచితంగా చేసి యువకుడి ప్రాణాలు కాపాడారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు దేవరకొండ అంకమ్మరావు. జిల్లాలోని మందపాడుకు చెందిన అతను డిసెంబరులో గుండె నొప్పి రావడంతో మేడికొండూరు పీహెచ్‌సీకి వెళ్లాడు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. జీజీహెచ్ గుండె జబ్బుల వార్డులో యాంజియోగ్రామ్ పరీక్షలు చేసి, సీటీఎస్ వార్డుకు తరలించారు. డిసెంబరు 19న సీటీఎస్ వైద్యులు గుండె బైపాస్ సర్జరీ చేసి సదరు వ్యక్తి ప్రాణాలు కాపాడారు. ఇలా ఎంతో మంది రోగులు పలు జిల్లాలకు చెందిన వారు గుంటూరు జీజీహెచ్‌కు ప్రాణాపాయ స్థితిలో వచ్చి సకాలంలో ఆపరేషన్లు చేయడం ద్వారా సంతోషంగా ఇంటికి వెళ్తున్నారు.

- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఆపరేషన్లు
- విజయవంతంగా కిడ్నీ మార్పిడి. గుండె బైపాస్ సర్జరీలు
- రూ.లక్షలాది ఖరీదు చేసే ఆపరేషన్లు పూర్తి ఉచితం
- ఏడు జిల్లాల నుంచి జీజీహెచ్‌కు వస్తున్న రోగులు



గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్దాసుపత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్యులు ఆపరేషన్లు చేస్తున్నారు. సుమారు రూ. 15 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తూ పేదల ప్రాణాలకు భరోసా కల్పిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే సాధ్యమయ్యే గుండె బైపాస్, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు, అవేక్ బ్రెయిన్ సర్జరీలు సైతం జీజీహెచ్ వైద్యులు చేస్తూ తమ సత్తాను చాటుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జీజీహెచ్‌పై ప్రత్యేక దృష్టి సారించి అత్యాధునిక వైద్య పరికరాలు సమకూర్చారు. ఐదేళ్ల పాలనలో గుంటూరు జీజీహెచ్‌కు సుమారు రూ.64 కోట్లు ఖరీదు చేసే పరికరాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసింది. వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతోపాటు, అదనంగా వైద్యులు, వైద్య సిబ్బందిని రిక్రూట్‌మెంట్ చేసింది. దీంతో గతంలో కంటే మెరుగ్గా నేడు జీజీహెచ్ వైద్యులు అన్ని రకాల అరుదైన శస్త్ర చికిత్సలను పేదలకు ఉచితంగా చేస్తూ కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా సేవలందిస్తున్నారు.

ప్రతిరోజూ ఆపరేషన్లు

గుంటూరు జీజీహెచ్‌లో ఆపరేషన్లు ప్రతిరోజూ జరుగుతున్నాయి. మేజర్, మైనర్, ఎమర్జెన్సీ ఆపరేషన్లు, ఎలక్టివ్ ఆపరేషన్లు 24 గంటలు చేస్తూ అరుదైన రికార్డులు సృష్టిస్తున్నారు. జనరల్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, గైనకాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్స్, అప్తమాలజీ, సర్జికల్ ఆంకాలజీ తదితర స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాల్లో ప్రతిరోజూ ఆపరేషన్లు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన రోగులతో పాటు ప్రకాశం, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలు, తెలంగాణాలోని ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి సైతం గుంటూరు జీజీహెచ్‌కు రోగులు వస్తున్నారు.



జీజీహెచ్‌లో గుండె ఆపరేషన్‌లు చేసే క్యాథల్యాబ్

ఏడాదిలో 28,858 ఆపరేషన్లు

గతేడాది గుంటూరు జీజీహెచ్‌లో ఓపీ విభాగంలో 12,34,855 మంది రోగులు చికిత్స పొందారు. అడ్మిషన్ అవసరమైన 70,119 మంది రోగులను వార్డులో చేర్చుకుని చికిత్స అందించారు. కొంత మంది మందుల ద్వారా వ్యాధి నుంచి కోలుకోగా 28,858 మంది రోగులకు ఆపరేషన్లు చేసి వైద్యులు ప్రాణాలు కాపాడారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 9,395 మంది రోగులకు ఆపరేషన్లు చేసి వైద్యులు రోగుల ప్రాణాలు కాపాడారు.

బౌద్ధం సదా ఆచరణీయం



వేడుకల్లో వీసీ ఆచార్య పి.రాజశేఖర్, గంగాధరరావు, కె.మధుబాబు, చెన్నారెడ్డి

ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: నేటి సమాజ దిక్సూచిగా బౌద్ధం నిలుస్తుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. వర్సిటీలోని బౌద్ధ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో గురువారం బుద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ బుద్ధ పూర్ణిమ, బౌద్ధ ధర్మం విశిష్టత ఎంతో గొప్పదన్నారు. బుద్ధుని ధర్మ విషయాలు అందరికీ ఆచరణ యోగ్యమైనవని, అవి సమాజానికి ఎంతో మార్గదర్శనమన్నారు. బౌద్ధ సిద్ధాంతాలు నేటి యువత అలవర్చుకొని రాణించాలని సూచించారు. జీవిత లక్ష్యాలను సాధించే క్రమంలో శాంతి, సహనం, కృషి, పట్టుదల వంటివి అలవర్చు కోవాలని చెప్పారు. బౌద్ధ అధ్యయన విభాగ అధిపతి ఆచార్య ఎల్.ఉదయ్ కుమార్ బౌద్ధ జయంతి ప్రాముఖ్యత, అధ్యయనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య గంగాధర రావు, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, విదేశీ విద్యార్థుల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి, దూర విద్య పరీక్షల విభాగ సమన్వయకర్త డాక్టర్ కె.సోమశేఖర్, అతిథి అధ్యాపకులు, పరిశోధకులు, బౌద్ధ విద్యార్థులు పాల్గొన్నారు.



బుద్ధుని చిత్రపటానికి నివాళి

బుద్ధుని బోధనలు ఆచరించాలి

లక్ష్మీపురం: సరళమైన తాత్వికత ఆచరణాత్మకతతో సమాజాన్ని ప్రభావితం చేసిన బుద్ధుని బోధనలు ఆచరించాల్సిందేనని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, రంగస్థల నటుడు పి.ఘనశ్యామాచార్యులు అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం బుద్ధ జయంతి జరిగింది. ముందుగా బుద్ధుని చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలో పుట్టిన కొత్త మతాలలో బౌద్ధం అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు నివాళులర్పించారు.

'హక్కుల పరిరక్షణ కమిటీ' గౌరవాధ్యక్షుడిగా శివకుమార్



గుంటూరు రూరల్: ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ కొమ్మెర్ల శివ కుమార్‌ను నియమించటం జరిగిందని పరిరక్షణ మండలి అధ్యక్షుడు బుల్లా రాజారావు తెలిపారు. గురువారం విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన మండలి రాష్ట్ర సమావేశంలో ఈ తీర్మానం చేయటం జరిగిందన్నారు. గుంటూరు రూరల్ మండలం నల్లపాడు గ్రామానికి చెందిన శివకుమార్ ప్రొఫెసర్‌గా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని తెలిపారు. 2024 మే 22 నుంచి 2026 డిశంబర్ 31 వరకు ఆయన చైర్మన్‌గా పదవిలో ఉంటారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని శివకుమార్ తెలిపారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



మేడికొండూరు: మండల పరిధిలోని మేడికొండూరు గ్రంథాలయాన్ని గుంటూరు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బారత్నమ్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, కథలు చదడం తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవాలు



లక్ష్మీ నరసింహస్వామి గ్రామోత్సవం

తాడేపల్లిరూరల్ : మంగళగిరిలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవాలు గురువారంతో అంగరంగ వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి రామ కోటిరెడ్డి మాట్లాడుతూ లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకల్లో భాగంగా చివరి రోజున ఉదయం 7 గంటలకు నారసింహ మూలమంత్ర హోమం ఘనంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస దీక్షితులు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

కాకుమాను: పెదనందిపాడు మండలంలోని వరగాని అంకమ్మ తల్లి గుడి ఆవరణలో గత మూడు రోజుల నుంచి లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం', అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'మనస్విని', ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి 'విముక్తి' నాటికలు నిర్వహించారు. చివరి రోజు నిర్వహించిన నాటిక పోటీలు ఆహూతులను అలరించాయి.

దళిత యువకుడిపై హత్యాయత్నం

తెనాలిరూరల్: పాత కక్షల నేపథ్యంలో దళిత యువకుడిపై హత్యాయత్నం చేసిన ఘటన తెనాలి మండలం కాజీపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు.. కొలకలూరుకు చెందిన ఉన్నం అరుణ్‌కుమార్ ఓ హైకోర్టు న్యాయవాది వద్ద గుమాస్తాగా పని చేస్తుంటాడు. మార్చిలో విధులకు వెళ్లి వస్తుండగా ఖాజీపేట వద్ద చెన్నంశెట్టి సురేష్, ప్రదీప్‌ల కారణంగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఇరు గ్రామాల పెద్దలు మాట్లాడి రాజీ కుదిర్చారు. గురువారం సాయంత్రం ఖాజీపేటలోని పెట్రోలు బంకు వద్ద అరుణ్‌కుమార్ తన బైక్‌లో పెట్రోలు పోయించుకుంటున్నాడు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన సురేష్, ప్రదీప్ అతనితో ఘర్షణ పడ్డారు. మారణాయుధాలతో దాడి చేశారు. గాయపడిన అరుణ్ తన బంధువులకు ఫోన్ చేయగా కొలకలూరుకు చెందిన ఉన్నం గోపి, కూచిపూడి కిరణ్ ఖాజీపేటకు చేరుకోగా వీరిద్దరిపైనా దాడి చేశారు. తలకు తీవ్రగాయాలైన అరుణ్‌కుమార్ నేరుగా రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సెక్షన్ 324, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పట్నంబజారు: ఆటో డ్రైవర్లు పూర్తిస్థాయిలో నిబంధనలకనుగుణంగా నడుచుకోవాలని డీటీసీ షేక్ కరీమ్ చెప్పారు. స్వర్ణభారతీ నగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో గురువారం డీటీసీ కరీమ్ గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ వి.వి.నాయుడు, ట్రక్కు, ప్యాసింజర్ ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవింగ్ చేసే సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనానికి ఖచ్చితంగా ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ వి.వి.నాయుడు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5వేలు, మద్యం సేవించి నడిపితే రూ.15వేలు, ర్యాష్ డ్రైవింగ్‌కు రూ.10వేలతో పాటు ప్రతి ఒక్క నిబంధన ఉల్లంఘనకు భారీ జరిమానాలు పడే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ వెస్ట్ సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలో వైద్యుని నైపుణ్యత పైనే ఫలితాలు



ప్రశంసా పత్రాలతో వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరులోని ఓ హోటల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సంయుక్తంగా నిరంతర వైద్య విద్యా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జి.జగదీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ జి.జగదీష్ మాట్లాడుతూ.. వైద్యులు మల్టిపుల్ ఫ్రాక్చర్స్ విషయంలో సరైన నిర్ణయం, సక్రమ శస్త్ర చికిత్స ద్వారా బాధితులకు మళ్లీ సాధారణ జీవితాన్ని అందించవచ్చునన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీఎస్ హరిత 'హార్ట్ ఫెయిల్యూర్ జీవితానికి అంత్య దశ' అనే అంశంపై ప్రసంగించారు. హార్ట్ ఫెయిల్యూర్ గుండె సంబంధ వ్యాధుల్లో అంత్య దశ కాదని చికిత్స ద్వారా మళ్లీ తిరిగి గుండెను మామూలు స్థితికి తీసుకురావచ్చన్నారు. డాక్టర్ జి.జగదీష్, డాక్టర్ చిత్తరంజన్ సాహు, డాక్టర్ పీఎస్ హరితలకు ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బి.సాయి కృష్ణ, రమేష్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ మమత ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చిత్తరంజన్ సాహూ, డాక్టర్ టి.సేవకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా అన్నమయ్య జయంతి



అన్నమయ్య జయంతి వేడుకల్లో..

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం అన్నమయ్య జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు సతీష్ స్వామి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు ప్రత్యేక అర్చనలు, అలంకరణ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎంవై.శేషురాణి, కాజా వేంకటసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొనసాగిన ధారావాహిక ప్రవచనం

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఐదు రోజుల పాటు నిర్వహిస్తోన్న శ్రీమద్భగవద్గీత – ఆత్మ సంయమయోగః ధారా వాహిక ప్రవచనం గురువారం కొనసాగింది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. జరుబుల బంగారుబాబు సౌజన్యంతో పూజ్యశ్రీ సువీరానందస్వామి (చిన్మయ మిషన్) నిర్వహించారు.

మిర్చియార్డు కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి బాధ్యతల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): గత నాలుగు మాసాలుగా సెలవులో కొనసాగుతున్న గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి ఏపీ వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వుల మేరకు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా కొనసాగిన కాకుమాను శ్రీనివాసరావు నుంచి వెంకటేశ్వరరెడ్డి ఛార్జి తీసుకున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ ప్రశాంతి ఉత్తర్వుల మేరకు వెంకటేశ్వరరెడ్డి సెలవులను రద్దు చేసుకొని యార్డు క్యాదర్శిగా తిరిగి విధుల్లో చేరి రిపోర్ట్ చేశారు.

కార్పొరేటర్ కార్యాలయం వద్ద ఘర్షణ

- మద్యం మత్తులో ఉన్న యువకులపై దాడి
- యువకులను చితకబాదిన కార్పొరేటర్, అనుచరులు
- లాలాపేట పోలీసు స్టేషన్‌లో పంచాయతీ
- యువకులను కొట్టి, వారిపైనే ఫిర్యాదు చేసిన కార్పొరేటర్

పట్నంబజారు: మద్యం సేవించి ఘర్షణ పడిన ముగ్గురు యువకులపై కార్పొరేటర్, అతని అనుచరులు దాడి చేసిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. లాలా పేట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 12వ డివిజన్ కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టి కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం అదే ప్రాంతానికి చెందిన అంజాద్, గౌస్, ముజాఫిర్ ముగ్గురు కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో కార్పొరేటర్ కార్యాలయం వద్ద స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. కార్పొరేటర్ చిష్టి అనుచరులు ముగ్గురు యువకులపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఘర్షణ జరుగుతుందని సమాచారం అందుకున్న లాలాపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు. యువకులపై అమానుషంగా దాడిచేసి, తిరిగి కార్పొరేటర్ చిష్టినే తనపై దాడిచేశారంటూ ఫిర్యాదు చేయడం గమనార్హం. దీనిపై లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ దేవప్రభాకర్‌ను వివరణ కోరగా విచారిస్తున్నామని తెలిపారు.

పార్టీ రంగు పులిమి కుట్రలు

ఇటీవల కాలంలో సార్వత్రిక ఎన్నికల ముందు 12వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ ఖాజామొహిద్దీన్ చిష్టి టీడీపీలో చేరాడు. గురువారం జరిగిన ఘటనకు సంబంధించి రాజకీయ రంగు పులిమే కుట్రలు చేయడం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీలో నుంచి టీడీపీలో చేరినందువల్లే తనపై దాడి జరిగినట్లు పోలీసుల ముందు చెప్పారు. అయితే యువకులు పూర్తి స్థాయిలో మద్యం సేవించి ఘర్షణకు దిగినట్లు పోలీసులు ధృవీకరించారు. కార్యాలయం వద్ద మద్యం మత్తులో జరిగిన ఘర్షణకు పార్టీ రంగు పులమొద్దంటూ హితవు పలికారు.

ఘనంగా తాళ్లపాక అన్నమయ్య జయంతి



తెనాలి: పదకవితా పితామహుడు శ్రీ అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాలను గురువారం సాయంత్రం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కళావేదికలో ఘనంగా నిర్వహించారు. మహతి, శ్రీ రామలింగేశ్వర భక్త సమాజం, శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామి, అన్నమయ్యకు అర్చన చేశారు. అనంతరం టీవీఎస్ శాస్త్రి, పర్చూరు సుబ్బారావు, కొండపి వసుంధరలు దేవి లలిత, యశస్విని, తుల్య శ్రీ, తులసి, శర్వాణితో కలిసి అన్నమయ్య కీర్తనలను జనరంజకంగా ఆలపించారు. ఈ సంకీర్తన కార్యక్రమానికి తబలాపై పెరవలి వంశీకృష్ణ, కీబోర్డుపై జి.నాగసాయి (గుంటూరు) వాద్య సహకారం అందించారు. నిర్వాహకుడు కొండపి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2010 సంవత్సరం నుంచి అన్నమాచార్యులు జయంతి ఉత్సవాలు, వర్ధంతి ఉత్సవాలు చేస్తున్నామని తెలిపారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత విశేషాలు, ఆయన ప్రాభవాన్ని వివరించారు. సురాభతుల కేశవ, అందే బాలచంద్ర మౌళి, కల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.